మీరేం చేస్తారో ప్రజలకు చెప్పండి

- నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి చెప్పలేక మభ్యపెడుతున్నారు
- దేవుడి పేరుతో ఒకరు.. తండ్రి పేరు చెప్పి మరొకరు ఓట్లు అభ్యర్థిస్తున్నారు
- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ధ్వజం
- అభివృద్ధి గురించి ఆలోచించే వినోద్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, మే 6: ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గానికి ఏం చేస్తారో కూడా చెప్పలేని దుస్థితిలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉన్నారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. బీజేపీ అభ్యర్థి దేవుడి పేరుతో ఓట్లు అడిగితే.. కాంగ్రెస్ అభ్యర్థి తన తండ్రి పేరు చెప్పి ఓట్లు అభ్యర్థిస్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల పార్టీ మారిన కార్పొరేటర్లు తమ డివిజన్లలో అభివృద్ధి జరుగలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు కూడా వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ వల్లే తమ డివిజన్లలో అభివృద్ధి జరిగిందని ఇంటింటికీ ప్రచారం చేశారని గుర్తు చేశారు. వారి డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు ఎవరి హయాంలో నిర్మాణమయ్యాయో చెప్పాలన్నారు. కేవలం అవకాశవాదంతోనే పార్టీ మారారని విమర్శించారు. నిజంగానే అభివృద్ధి కోసమే వెళ్లారంటే ప్రభుత్వం ఏర్పాటైన సమయంలోనే ఎందుకు పార్టీ మారలేదని ప్రశ్నించారు. ఇలాంటి రంగులు మార్చే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పార్టీ నుంచి 10 మంది కార్పొరేటర్లు పోతే జరిగే నష్టం ఏమీలేదన్నారు. అన్ని డివిజన్లలో కార్పొరేటర్లే వెళ్లారని, నాయకులందరూ పార్టీలోనే కొనసాగుతున్నారని స్పష్టం చేశారు. వారంతా ఇప్పుడు వినోద్‌కుమార్ గెలుపు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. దేవుడి పేరుతో, తండ్రి పేరుతో ఓట్లు అడుగుతున్న వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్యారాచూట్ వ్యక్తి అని విమర్శించారు. ఏ రోజైనా తమ ఇబ్బందులు, బాధలను పట్టించుకున్నారో ఆ పార్టీ కార్యకర్తలు ఆలోచించాలన్నారు. వ్యాపారం చేసుకునే వ్యక్తిని తీసుకువచ్చి పోటీకి పెట్టారని దుయ్యబట్టారు. బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా ఉండి నియోజకవర్గానికి ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదన్నారు. కనీసం ఐదేళ్ల పాలనలో ఒక్క మున్సిపల్, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ మీటింగ్‌కు కూడా హాజరు కాలేదని మండిపడ్డారు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వినోద్‌కుమార్ గత ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకువచ్చింది వినోద్‌కుమార్ కాదా? అని నిలదీశారు. కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వే పనులకు శంకుస్థాపన చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నగరంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా సాగుతున్నదంటే అది వినోద్ చలువేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరీంనగర్‌లో రోజు నీటి సరఫరా జరుగడం లేదని, మానేరు రివర్ ఫ్రంట్ పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. వీటిన్నింటిపై ఎంపీగా బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారా? అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ మళ్లీ తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ కేంద్రం, వరంగల్ –కరీంనగర్ రైల్వే లైన్, ట్రిపుల్ఐటీ తీసుకురావడంతో పాటు, జాతీయ రహదారులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తున్నారని పేర్కొన్నారు. మరి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఏం చేస్తారో ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. వారు సెంటిమెంట్‌తో ఓట్లు అడగడం తప్ప ప్రజల ఇబ్బందులను పట్టించుకోరన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి కోసం కృషి చేసే వినోద్‌కుమార్‌ను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తారని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, ఆరె రవి గౌడ్, చంద్రశేఖర్, మెరుగు శ్రీనివాస్ గౌడ్, సత్తినేని శ్రీనివాస్, ఒడ్నాల రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల కమీషనింగ్ పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

పకడ్బందీగా ఈవీఎంల కమీషనింగ్

- డీఈవో పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 6 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమీషనింగ్‌ను అధికారులు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలన్నారు. నగరంలోని ఎస్సారార్ కళాశాలలో కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియను సోమవారం ఉదయం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ, 395 పోలింగ్ స్టేషన్లకు బ్యాలెట్ యూనిట్లు 990, 493 కంట్రోల్ యూనిట్లు, 553 వీవీప్యాట్లు రిజర్వు చేసిన వాటితో కలుపుకొని కేటాయించినట్లు పేర్కొన్నారు. చొప్పదండి సెగ్మెంట్‌లో 327 పోలింగ్ స్టేషన్లకు 820 బ్యాలెట్ యూనిట్లు, 408 కంట్రోల్ యూనిట్లు, 457 వీవీప్యాట్లు రిజర్వుతో కలుపుకొని కేటాయించినట్లు వెల్లడించారు. మానకొండూర్ సెగ్మెంట్‌లో 316 పోలింగ్ కేంద్రాలకు 794 బ్యాలెట్ యూనిట్లు, 395 కంట్రోల్ యూనిట్లు, 442 వీవీప్యాట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు వీటన్నిటినీ పోలింగ్‌కేంద్రాలకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు కనకయ్య, రమేశ్, రాజేశ్, నరేందర్, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'పొన్నం బీసీల వ్యతిరేకి'

విద్యానగర్, మే 6: మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీల వ్యతిరేకిగా మారారని గౌడ జాగృతి కల్లు గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగు సంపత్ గౌడ్ విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, హుస్నాబాద్‌లో గౌడ కులస్తుల ఓట్లతో గెలిచి మంత్రిగా కొనసాగుతున్న పొన్నం.. గౌడ కులస్తుల సమస్యలపై ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీసీ సమాజం ఆయనకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎన్నం ప్రకాశ్, రాగి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కాంల కాంగ్రెస్‌ను ఓడించాలి

జమ్మికుంట, మే 6 : స్కాంల కాంగ్రెస్‌ను ఓడించాలని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలోని శంకరనందన గార్డెన్‌లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ రూ.12 లక్షల కోట్ల స్కాం చేసిందని, అవినీతికి చిరునామాగా మారిన వైనాన్ని వివరించారు. ఇక్కడ బీజేపీ, దాని అనుబంధ సంఘాల జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకే పట్టం కట్టండి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ సతీమణి మాధవి
- చొప్పదండి, కరీంనగర్ మండలాల్లో ఎన్నికల ప్రచారం



చొప్పదండి: రాగంపేటలో మాట్లాడుతున్న వినోద్ కుమార్ సతీమణి మాధవి

చొప్పదండి/ కరీంనగర్ రూరల్, మే 6: ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి మాధవి కోరారు. సోమవారం చొప్పదండి మండలంలోని రేవెళ్లి, రాగంపేట, కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికీ అత్యధిక నిధులు తెచ్చి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేసిన ఘనత వినోద్ కుమార్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బందారపు అజయ్, జోగినపల్లి అశ్విన్, మామిడి రాజేశం, శంకర్, రాజేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో దేశంలో మత విద్వేషాలు

తెలంగాణచౌక్, మే 6: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినాటి నుంచి దేశంలో మత విద్వేషాలు పెరిగాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపేతర రాష్ట్రాల్లో పాలకులపై కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా మిత్రపక్షాలతో కలిసి అడ్డుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు బుచ్చన్న యాదవ్, కొయ్యడ సృజన్‌కుమార్, పైడిపల్లి రాజు, పొనగంటి కేదారి, నగరం కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

శంకరపట్నం, మే 6: కేశవపట్నం గ్రామానికి చెందిన పంజాల భారతి (55) వడదెబ్బతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. భారతి కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురైంది. ఇటీవలే కోలుకుంది. కాగా, సోమవారం ఎండ వేడిమికి తట్టుకోలేక ఇంట్లోనే అస్వస్థతకు గురైంది. సాయంత్రం 5 గంటలకు కన్నుమూసింది.

'భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి'

తెలంగాణచౌక్, మే 6: భూమిని ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని భీవండికి చెందిన లక్ష్మీ మల్లేశం దంపతులు కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం దంపతులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జీవనోపాధి కోసం భీవండిలో నివసిస్తున్న తాము సీతారాంపూర్‌లో 1984లో రాగి భద్రయ్య వద్ద సర్వేనంబర్ 22బీలో 30 గుంటల భూమి కొనుగోలు చేశామని, అందులో 22 గుంటల భూమి విక్రయించగా మిగతా ఎనిమిది గుంటలను ఇంటి నిర్మాణం కోసం ఉంచుకున్నామని చెప్పారు. 2005 సంవత్సరంలో ఇంటి నిర్మాణం కోసం అప్పటి గ్రామపంచాయతీ నుంచి అనుమతి కూడా తీసుకున్నామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇంటి నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. సీతారాంపూర్ కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత కూడా 2005 సంవత్సరంలో ఇంటి అనుమతులను పొంది, 2020లో ప్రహరీ నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ నెల 2న స్థలం వద్దకు వెళ్లగా కొత్త జైపాల్‌రెడ్డి, జంగిలి సాగర్, వారి అనుచరులు కంకణాల విజయేందర్‌రెడ్డి, ఎదుల్లా విజయభాస్కర్‌రెడ్డి, రోమాల రమేశ్ తప్పుడు పత్రాలతో వచ్చి, స్థలాన్ని తాము కొనుగోలు చేశామని బెదిరిస్తూ దాడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

భూమిని కొనుగోలు చేశా: ఎదుల్లా విజయ భాస్కర్‌రెడ్డి

నీతారాంపూర్‌లో గల ఎనిమిది గుంటల భూమిని తాను ఆక్రమించుకున్నట్లు భీవండికి చెందిన లక్ష్మీమల్లేశం దంపతులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఎదుల్లా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సదరు భూమిని విజయేందర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి తాను కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రెస్ భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు ఇచ్చిన అన్ని అనుమతి పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. భూమి పత్రాలతో పాటు అన్ని ఆధారాలతో సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాగే తాను ఎవరిపైనా దాడులు చేయలేదని, తప్పు చేసినట్లు రుజువు అయితే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

కారు ఢీకొని ఒకరి మృతి

రాంనగర్, మే 6: కరీంనగర్ మండలం ఇరుకుల్ల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సంపత్ కుమార్ (43) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్శేడు గ్రామానికి చెందిన సంపత్ కుమార్ చేగుర్తి పంప్ హౌస్‌లో ప్రైవేట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఇరుకుల్లలో బంధువుల శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వెళ్తున్న కారు (టీఎస్ 07ఈజె1616 నంబర్) అతివేగంగా వచ్చి ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన సంపత్ కుమార్‌ను స్థానికంగా ఉన్న చల్మెడ హాస్పిటల్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ సంపత్ కుమార్ మృతి చెందాడు. అతడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఎండీ అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విద్యానగర్, మే 6 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బొమ్మకల్ వ్యవసాయ ఆదర్శ క్షేత్రంలో సోమవారం వయో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 102 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఇంజినీర్ కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలతో ప్రమాదాల నివారణ

విద్యుత్ భద్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ గంగాధర్

ముకరంపుర, మే 6: నిర్దేశించిన విధంగా భద్రతా ప్రమాణాలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వీ గంగాధర్ తెలిపారు. విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో హుజూరాబాద్ డివిజన్ ఆపరేషన్, మెయింటనెన్స్ సిబ్బంది, ఏఈలు, ఏడీలు, డీఈలకు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు సిబ్బందితో విద్యుత్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, ఎస్ లక్ష్మీరెడ్డి, ఎస్ ఏవో రాజేశం, ఏడీఈలు శ్రీనివాస్, సీహెచ్ రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి, హుజూరాబాద్ ఏఈలు, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలి

గంగాధర, మే 6 : కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండానే ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీతో అమలు చేసినట్టు చెప్పించడమేమిటని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలతో అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలని, అభివృద్ధి చేసే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ను గెలిపించాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ప్రజలను కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

రాంనగర్, మే 6: ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నియమావళి పాటించాలని, ఉల్లంఘించి పట్టుబడిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. కాగా, నగరంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.5.32 లక్షలు పట్టుకున్నట్లు కరీంనగర్ త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం డబ్బును స్వాధీన పరుచుకుని తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని పేర్కొన్నారు.

సైదాపూర్, మే 6: మండలంలోని ఎలబోతారం వద్ద వాహనాల తనిఖీలో అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.28లక్షలను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

'కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సంఘాల మద్దతు లేదు'

తెలంగాణచౌక్, మే 6: కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ఆర్‌బీవీఆర్‌ఆర్‌రెడ్డి సంఘం అధ్యక్షుడు జగ్గారెడ్డి చేసిన ప్రకటన వాస్తం కాదని పలు రెడ్డి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం పలు రెడ్డి సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఇసుక వ్యాపారాలను నడుపుకోడానికి కొందరు రెడ్డి నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంఘాలను తాకట్టు పెట్టడానికి సిద్ధపడ్డారని ఆరోపించారు. సమావేశంలో పలు రెడ్డి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిపై ఎన్నికల ఉల్లంఘన కేసు

కరీంనగర్ రాంనగర్, మే 6 : అనుమతి లేకుండా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు గాను కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతోపాటు ఆకుల ప్రకాశ్‌పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం ఉదయం హౌసింగ్‌బోర్డుకాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమంది ప్రజలను సమావేశపరిచి ప్రచారం నిర్వహించి, నియమావళి ఉల్లంఘించారని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రమణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజేందర్‌రావుతో పాటు సభ ఏర్పాటు చేసిన 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి తెలిపారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, మే 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌గా బైరి వెంకటేశంను నియమించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సిరిపాటి వేణు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రెస్ భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అత్యంత వెనుకబడిన ఎస్సీ ఉపకులాల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ దోహదపడుతుందని తెలిపారు.

ట్రినిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

కరీంనగర్ రూరల్, మే 6: బొమ్మకల్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జెనపాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 250 మంది విద్యార్థులు హాజరుకాగా, 86 మంది షార్ట్ లిస్ట్‌లో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. వారిని కళాశాల చైర్మన్ అభినందించారు.

బీపీఈడీ, బీ ఫార్మసీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, మే 6 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ, బీ ఫార్మసీ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్, బీ ఫార్మసీ మొదటి, రెండో, ఏడు, ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విద్యానగర్, మే 6: కోరుట్ల ప్రభుత్వ దవాఖాన వైద్యుడు శ్రవణ్‌పై ఆదివారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ నవీన, డాక్టర్ పద్మ, హరికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ సతీశ్, డాక్టర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన కరీంనగర్ ఐఎంఏ బ్రాంచ్

కోరుట్ల ప్రభుత్వ దవాఖాన వైద్యుడు, సిబ్బందిపై జరిగిన దాడి, హత్యాయత్నాన్ని కరీంనగర్ బ్రాంచ్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్ తెలిపారు. అలాగే దాడి ఘటనను డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్లు బీఎన్‌రావు, జగన్మోహన్‌రావు, కిషన్, అలీమ్, రాజ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.

చలివేంద్రం ప్రారంభం

తిమ్మాపూర్, మే 6: రామకృష్ణ కాలనీ గ్రామంలో సుభాష్ నగర్, రామకృష్ణ కాలనీ స్టేజీల వద్ద గ్రామ నాయకుడు దావు సంపత్ రెడ్డి తన తల్లి మధురమ్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. కార్యక్రమాల్లో మాచర్ల అంజయ్య, వేల్పుల ఓదయ్య, కొమ్మర మల్లారెడ్డి, సిరికొండ వెంకట్రావు, అల్వాల కుమార్, దావు శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, నరేశ్, సంపత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీని సందర్శించిన నాబార్డ్ కమిటీ

విద్యానగర్, మే 6: కరీంనగర్ సహకార కేంద్ర బ్యాంక్‌ను సోమవారం నాబార్డ్ ఏర్పాటు చేసిన కమిటీ సందర్శించింది. జిల్లాలో సీడీఎఫ్ (కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధుల వినియోగంపై ఈ కమిటీ అధ్యయనం చేసింది. నాబార్డ్ రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ డీ రవీంద్ర ఆధ్వర్యంలో సందర్శనకు వచ్చిన ఈ కమిటీకి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణ రావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. సీడీఎఫ్ నిధుల వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అమలవుతున్న విధానాలు దేశంలోనే అత్యుత్తమమైనవని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. టెస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎఫ్ మురళీధర్ మాట్లాడుతూ, ఇక్కడి విధానాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి చేసిన సిఫారసులు అమలయ్యాయని తెలిపారు. పీడీసీ రిసోర్స్‌పర్సన్ జీ సత్యనారాయణ బ్యాంకు అభివృద్ధిని నాబార్డ్ కమిటీకి వివరించారు. నాబార్డ్ కమిటీ నిర్వహించిన సమావేశంలో నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, మనోహర్ రెడ్డి, దిలీప్, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.